
# ఓ నైట్ డ్యూటీ



# పొగబండి కథలు




**ఓలేటి శ్రీనివాసభాను**

అటూ ఇటూ తిప్పి చూశారు జనార్ధనరావు గారు.

అదో శుభలేఖ

తన పాత అడ్రస్‌కి వెళ్లి, అక్కణ్నించి రీ డైరెక్ట్ అయి వచ్చింది. కవర్ నిండా పచ్చబొట్టు పొడిచినట్లు తపాలా ముద్రలు, కొట్టివేతలు, అడ్డదిడ్డంగా అక్షరాలు.

ఓ జంక్షన్ స్టేషన్‌లో డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్‌గా రిటైర్ అయి, కొన్నాళ్ల పాటు సొంతూళ్లో గడిపి, భార్య చనిపోయాక ముంబాయిలోని పెద్ద కొడుకు ఇంట్లో ఉంటున్న జనార్దన్‌రావుగారికి ఆ శుభలేఖ ఓ ప్రహేళికలాగా అనిపించింది.



కవరు మీద తన పేరూ, గట్రా కరెక్టుగానే ఉన్నాయి. కానీ లోపల అరిటాకు డిజైనులో పలచని శుభలేఖ మీది 'శుభలేఖార్థములు' రాసిన వ్యక్తి ఎవరో జనార్దన్‌రావుగారికి గుర్తుకు రాలేదు. ఆయన చాలా సేపు ఆలోచించారు. రైల్వే సర్వీసులో తనకి తారసపడ్డ పేర్లన్నీ జ్ఞాపకాల పుటల్లో గాలించారు. అలా ఆరోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ ఆలోచించగా ఆలోచించగా ఆయనకో నైట్‌డ్యూటీ గుర్తుకొచ్చింది.

ఇరవై రెండేళ్ల క్రితం...

ఆయన రిటైర్ కావడానికి రెండేళ్ల ముందు....

ఓ జంక్షన్ స్టేషన్‌లో పెద్ద వర్షం పడింది. కరెంటు పోయింది. బర్రుమని చప్పుడు చేస్తూ జనరేటరు... బళ్లు కదలకపోవడంతో జనార్దనరావు గారిని చుట్టుముట్టిన ప్రయాణీకులు...ఒకటే గోల...గందరగోళం...

రైల్వే ఆపరేటింగ్ పరిభాషలో దాన్ని 'బంచింగ్ ఆఫ్ ట్రెయిన్స్'అంటారు. కొన్ని బళ్లు ఆలస్యంగా నడవడం, ఇంకొన్ని బళ్లు అనుకున్న సమయానికి బయల్దేరకపోవడం, ప్లాట్‌ఫారాలు ఖాళీ లేకపోవడం వల్ల స్టేషన్ బయట సిగ్నల్స్ దగ్గర బళ్లు నిలిచిపోవడం-ఇవన్నీ 'బంచింగ్ ఆఫ్ ట్రెయిన్స్'లో భాగాలే. ఆరోజు నైట్ డ్యూటీలో అదే జరిగింది. జనార్దనరావుగారికి ఊపిరి సలపడం లేదు. ఏ ప్లాట్‌ఫారమ్మీద చూసినా బళ్లే!

ఓ ప్యాసింజరు బండి తాలూకు ఇంజను చెడింది. మరో ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్‌కి వాక్యూం ట్రబుల్.

ఇంకో మెయిల్‌బండీ కనెక్టింగ్ ట్రెయిన్ కోసం ఎదురుచూస్తోంది. సదరు కనెక్టింగ్ ట్రెయిన్ ఆరోజు లేటుగా నడుస్తోంది. అది

జంక్షన్ స్టేషన్‌కి వచ్చాక అందులోని రెండు స్లీపర్ బోగీల్ని డిటాచ్ చేసి మెయిల్ బండీకి తగిలించాలి. దానికి తోడు వాన. నీలుగుతున్న జనరేటర్...మూలుగుతున్న దీపాలు...

అలాంటి సమయంలో స్టేషన్‌లో పనిచెయ్యడం కన్నా శతావధానం చెయ్యడం సులువు. జనార్దనరావుగారు బొంగరంలాగా తిరుగుతున్నారు. ఇంజన్ మెకానిక్‌నీ, టీ ఎక్స్ఆర్ స్టాఫ్‌నీ తొందరపెడుతూ, కంట్రోల్ ఫోన్‌లో మాట్లాడుతూ, ప్రయాణీకులకు నచ్చచెబుతూ, కనెక్ట్ చెయాల్సిన ట్రెయిన్ కోసం ఎదురు చూస్తూ, అంతటా తానై, అన్నీ ప్లాట్‌ఫారాల మీదా, ఆ వయసులోనూ పరుగులు పెడుతున్నారు జనార్దనరావుగారు.

అదృష్టం బాగుంది. వాన వెలిసింది. కరెంటు వచ్చింది. ప్యాసింజరు బండీ ఇంజను బాగైంది. ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ వాక్యూం వచ్చింది. ఆ రెండు బళ్లూ కదిలాయి. బరువు దిగింది. కాసేపట్లో మెయిల్ బండీ తాలూకు కనెక్టింగ్ ట్రెయిన్ రానే వచ్చింది. అందులోని రెండు స్లీపర్ బోగీల్ని మెయిల్‌కి తగిలించారు. సిగ్నల్ పడింది. మెయిల్ కూత పెట్టి, చీకట్లో కనుమరుగయింది.

ప్లాట్‌ఫారమ్మీద స్టాల్‌వాలా చిక్కటి టీ కలిపాడు. వేడి టీని తాగుతూ, ఊపిరి పీల్చుకున్నారు జనార్దనరావుగారు.

అప్పుడు–

''సార్'' అంటూ దూరం నుంచి పిలుపు.

ఎవరా? అన్నట్లు అటూ ఇటూ చూశారు జనార్దన్‌రావుగారు. అవతలివైపు ప్లాట్‌ఫారమ్ మీద ఖాళీగా ఉన్న కనెక్టింగ్ ట్రెయిన్ బోగీ లోంచి ఎవరో పిలుస్తున్నారు. జనార్దన్‌రావుగారు అటూ ఇటూ చూశారు. రెండడుగులు ముందుకు వేశారు. ఓ ఖాళీ బోగీలోంచి సీ అండ్ డబ్ల్యూ కలాసీ నారాయణ ఆత్రుతగా కిందకి దిగాడు. గబగబా అడుగులేస్తూ జనార్దాన్‌రావుగారి దగ్గరకు వచ్చాడు.

''ఏంటి నారాయణా?'' అడిగారు జనార్ధన్ రావుగారు.

''సార్...అర్జెంటు...మీరోసారి వచ్చి చూడాల'' అంటూ ఓ ఖాళీ బోగీలోకి వెళ్లాడునారాయణ.

కనెక్టింగ్ ట్రెయిన్ వచ్చిన తరువాత ఖాళీ బోగీల్ని తనిఖీ చేసి, షట్టర్స్ దించి, బోర్డులు తొలగించడం నారాయణ డ్యూటీ. ఆ రోజు నైట్‌డ్యూటీలో నారాయణ ఏం చూశాడో మరి, డిప్యూటీ స్టేషన్ సూపరింటెండెంట్ జనార్దనరావుగారిని పిలిచాడు.

వాళ్లిద్దరు ఎక్కిన బోగీ చీకటిగా ఉంది.

ప్లాట్‌ఫారమ్మీది ట్యూబ్‌లైట్ కాంతి షట్టర్స్ సందుల్లోంచి పలచగా వస్తోంది.

జనార్దన్‌రావుగారికి అనుమానం వచ్చింది. ఆ కనెక్టింగ్ ట్రెయిన్‌లోని జనరల్ బోగీల్లో అడుక్కునే వాళ్లూ, తాగుబోతులూ తరచూ వస్తుంటారు. వాళ్లు శవాలుగా మిగిలిన సందర్భాలూ ఉన్నాయి. కంపార్ట్‌మెంటులో అదోరకమైన వాసన కడుపులో తిప్పుతోంది. 'ఇదేదో డెడ్‌బాడీ కేసులా ఉంది. పోలీసులను పిలవాలి...' అనుకుంటూ ముక్కుకి రుమాలు అడ్డంగా ఉంచుకున్నారు జనార్దన్‌రావుగారు.

నారాయణ కాకీ యూనిఫాం ప్యాంట్ జేబులోంచి అగ్గిపెట్టె తీసి పుల్ల వెలిగించి, కిందికి వంగాడు.

''సార్ చూడండి'' సీటు కింద చూపించాడు.

జనార్దన్‌రావు గారు కిందకి వంగారు. అలా వంగడం వల్ల ఆయన బరువు పాదాలకు చేరింది. బూట్ల కింద వేరుసెనగ తొక్కలు చిట్లి చప్పుడు చేశాయి. జనార్దన్‌రావుగారు కళ్లజోడు సవరించుకొని సీటు కింద ఏముందో చూసేలోగా అగ్గిపుల్ల అయిపోయింది. వేలికొసలు చురుక్కుమనేదాకా అగ్గిపుల్లను అలాగే పట్టుకొన్న నారాయణ కాలిన పుల్లను పారేసి, మరో పుల్ల వెలిగించాడు.

''ఏవిటిది నారాయణా? పాత గుడ్డల మూట లాగా ఉంది...'' అన్నారు జనార్దన్ రావుగారు.

''నేనూ అలాగే అనుకున్నాను సార్.. కానీ చూడండి...'' నారాయణ వాక్యం పూర్తి చేసేలోగా ఆ మూట కొంచెం కదిలింది.

నారాయణ అగ్గిపెట్టెను జనార్దన్‌రావుగారి చేతికి అందించి, రెండు చేతుల్నీ సీటుకింద ఉంచాడు.

జనార్దన్‌రావుగారు అగ్గిపుల్ల వెలిగించారు.

''నాకు పెళ్లయి పదిహేనేళ్లయింది. మా ఇంటిదానికి పిల్లలు పుట్టరని డాక్టర్లు చెప్పేసారు. నన్ను మరో పెళ్లి చేసుకోమంటూ ఇంట్లో ముసలోళ్లు ఒకటే గొడవ. నాకది ఇష్టం లేదు....''

ఆ వెలుగులో నారాయణ చేతుల్లో బాగా చిరిగిపోయిన బట్టల మూటలో...

ఓ నెత్తుటి గుడ్డు... మంచులో తడిసిన గులాబీ మొగ్గ....

''ఆడబిడ్డ సార్...'' ఉబ్బెత్తుగా ఉన్న కనురెప్పలను మునివేళ్లతో తుడుస్తూ అన్నాడు నారాయణ.

జనార్దన్‌రావుగారు ''ఊం'' అంటూ నిట్టూర్చారు. ఏ తల్లో కని, విడిచిపెట్టేసింది. అంతలో కంపార్ట్‌మెంట్‌లో కుదుపు. ఖాళీ అయిన బోగీల్ని కోచింగ్ యార్డ్‌కి తీసుకెళ్లడానికి షంటింగ్ ఇంజన్ వచ్చినట్లుంది.

''నారాయణా.. ఈ పసిగుడ్డుని గుర్తించింది నువ్వు. రూల్ ప్రకారం నిన్ను ప్రథమ సాక్షిగా తీసుకొని నేను పోలీసులకు రిపోర్ట్ చేసి, ఈ బిడ్డని వాళ్లకి అప్పగించాలి. ఆ తరువాత వాళ్ల రూల్స్ వాళ్లకుంటాయి. ఏ హాస్పిటల్‌కో, అనాథశరణాలయానికో ఈ పాపని అప్పగిస్తారు. సాక్షిగా ఉండడానికి నీకు అభ్యంతరం లేదు కదా? కదలబోతున్న బోగీ లోంచి దిగుతూ అన్నారు జనార్దన్ రావు గారు.

''అదేం లేదు సార్'' పసిగుడ్డుని పొదివి పట్టుకుని కిందికి దిగాడు నారాయణ.

ఖాళీ బోగీల్ని షంటింగ్ ఇంజన్ తీసుకువెళ్లిపోయింది. ప్లాట్‌ఫారమ్ ఖాళీగా మిగిలింది.

''సార్...'' నారాయణ మెల్లగా పిలిచాడు.

జనార్దన్‌రావుగారు వెనక్కి తిరిగారు.

''ఏ బంధమూ లేకుండా ఓ ప్రాణిని మరో ప్రాణి కలుసుకోదంటారు. ఈ పసిగుడ్డు నా చేతుల్లోకి వచ్చాక అది నిజమేననిపిస్తోంది సార్.

''......''

''నాకు పెళ్లయి పదిహేనేళ్లయింది. మా ఇంటిదానికి పిల్లలు పుట్టరని డాక్టర్లు చెప్పేసారు. నన్ను మరో పెళ్లి చేసుకోమంటూ ఇంట్లో ముసలోళ్లు ఒకటే గొడవ. నాకది ఇష్టం లేదు....''

''......''

''మీరు ఒప్పుకుంటే ఈ బిడ్డని నేను పెంచుకుంటాను. సొంత కూతురులాగా చూసుకుంటాను. పుట్టిన తరువాత పాలూ, నీళ్లు లేనట్టుంది. గుడ్డు సొమ్మసిల్లిపోయింది'' నారాయణ గొంతు వణికింది. అతని చేతులూ వణికాయి.

జనార్దన్‌రావుగారికి మనసూ వణికింది.

ఏదో చెప్పాలనుకున్నారు.

తన తల్లి కనిపారేసిందన్న సంగతి ఆ బిడ్డకి తెలీకుండా పెంచాలని నారాయణకి సూచించాలనుకున్నారు.

అన్నీ చెప్పి, తన పేరు బయటకు పొక్కకూడదు ఎలాంటి పరిస్థితుల్లోనూ నోరు జారవద్దని హెచ్చరించాలని కూడా జనార్దన్‌రావుగారు అనుకొన్నారు. కానీ అవన్నీ గొంతు వాకిలి దాటలేదు. గుండె దగ్గరే గూడు కట్టుకొని పోయాయి. ఏదో ఉద్వేగం...మాటలు రాలేదు.

''సరే'' అతి బలవంతమ్మీద ఆ రెండు అక్షరాలు మాత్రమే వచ్చాయి.

***

జనార్దన్‌రావుగారికి ఇరవైరెండేళ్లనాటి డ్యూటీ.. నారాయణ చేతుల్లో పసిగుడ్డూ....వీటన్నిటిని గుర్తు చేసింది ఆ శుభలేఖ.

నారాయణ కూడా రిటైర్ అయిపోయి ఉంటాడు. శుభలేఖలోని అడ్రస్ చూస్తే అతను సొంతూరులో స్థిరపడినట్లు అర్థమవుతోంది. అది ప్రకాశం జిల్లా మార్కాపురం దగ్గర ఓ పల్లెటూరు.

రైల్వే డివిజన్ ఆఫీసుకు వెళ్లి పాస్ తెచ్చుకున్నారు జనార్దన్‌రావుగారు. ముంబాయి నుంచి మార్కాపురం కనీసం రెండు బళ్లు మారాలి. రిజర్వేషన్ కూడా చేయించుకున్నారు. తెలిసిన వాళ్ల ఇంట్లో పెళ్లికి వెడుతున్నానని కొడుకుకీ, కోడలికీ చెప్పి బండి ఎక్కారు జనార్దన్‌రావుగారు.

నిజానికి అప్పటికే పెళ్లయి రెండురోజులు అయిపోయింది. ఆలస్యంగా అందిన శుభలేఖ ద్వారా ఆ విషయం జనార్దన్‌రావుగారికి తెలుసు. తెలిస్తే కొడుకు, కోడలూ ''ఇప్పుడు అంత అవసరమా?'' అని అంటారనీ తెలుసు!

నారాయణను చూడాలి....అక్షింతలు వేసి ఆశీర్వదించాలి...అంతే!

*